# కష్టజీవులు

—గోపా—

## లేబర్‌టీచర్ల దుస్థితి

చెన్నరాష్ట్ర లేబర్‌స్కూల్ టీచర్ల సంఘాధ్యక్షులు శ్రీ పి వి రెడ్డిగారు యిలా వ్రాస్తున్నారు:

చెన్నరాజధానిలో సుమారు 1100 లేబర్‌స్కూళ్లున్నవి. ఇందులో 1900 టీచర్లు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలల్లో సుమారు 60 వేలమంది విద్యార్థి విద్యార్థినులు చదువుతున్నారు. ఈస్కూళ్లు లేబర్, రెవిన్యూడిపార్టుమెంట్ల క్రింద నడుపబడుతున్నవి. నిమ్నజాతుల నుద్ధరించే నిమిత్తమై స్థాపించబడిన ఈ డిపార్టుమెంటు టెంపరరీ డిపార్టుమెంటుగా సుమారు ముప్పైసంవత్సరాలుగా వుంటున్నది డిపార్టుమెంటు టెంపరరీ అనే కారణంతో లేబర్‌స్కూళ్లల్లో పనిచేసే యావన్మంది ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను టెంపరరీ నౌకర్లుగా చూస్తూవచ్చినారు. ఇరవైయేండ్లు సర్వీసువున్నవారినే టెంపరరీగానే భావిస్తూవచ్చినారు టెంపరరీ నౌకర్లకు పెన్షన్లేదు. సిక్కులీవులేదు. ఇంకాకొన్ని హక్కులు, హోదాలు లేవు. అందుచేత లేబర్‌టీచర్లు చాలా యిబ్బందిపడుచున్నారు. రాష్ట్ర లేబర్‌స్కూలు టీచర్లసంఘాన్ని తే 20-12-44 దిన నెల్లూరులో స్థాపించి, అప్పటినుండి ఆందోళన సాగించగా 1946 సంగ జనవరినెలలో అడ్వయిజర్ ప్రభుత్వంవారు, మొత్తం టీచర్లలో సగంమందిని ఖాయంచేసినారు. ఖాయంచేసేరేగాని, అనేకమంది ఖాయంచేయబడిన టీచర్లకు శాశ్వతనౌకరీవలని లాభాలు పొందలేదు. ఖాయముచేయని టీచర్లలో చాలమందికి 10 సం॥ల సర్వీసుకూడా వున్నది ప్రొబేషను పూర్తియైన ప్రతిటీచర్ను ఖాయంచేయడం న్యాయం, అవసరం, సమంజసం. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడినప్పటినుండి మొరపెట్టుకుంటున్నా ఇంతవరకు ఈ టీచర్లగోడు చెవికి అంతగా పట్టినట్టు కన్పించదు. ప్రజాసేవకులైన మనమంత్రాంగం వెంటనే ఈవిషయంలో తగుచర్య తీసికొని, లేబర్ టీచర్లకు న్యాయం కలిగిస్తారని విశ్వసిస్తున్నాను.

## కాలేజిటీచర్ల సంఘం

నెల్లూరు వెంకటగిరి రాజా కళాశాల ఉపన్యాసకుల సంఘ సమావేశం 1 తేది జరిగింది. నెల్లూరు జిల్లా వాసులకు, కళాశాల ప్రాత విద్యార్థులకు కాలేజి ఉద్యోగాలలో మొదటి స్థానం యివ్వమని. విశ్వవిద్యాలయ కమీషన్ వారు నిర్ధారణచేసిన ప్రకారం ఉపన్యాసకులకు వేతనాలివ్వమని, ఇంక్రిమెంట్లు అందెన్నుడు పక్షపాత రహితంగా యివ్వమని కాలేజి ఉపన్యాసకుల సంఘం కళాశాల కమిటీని కోరుతూ తీర్మానాలుచేసినట్లు విశ్వసనీయ వర్గాలద్వారా తెలుస్తున్నది.

## మోటారు కార్మికులు

నెల్లూరులో మోటారు కార్మికుల తమకోరకు అత్యుత్సాహంతో పనిచేస్తున్న తమ సంఘమొకటున్నా చాలా నిరుత్సాహ పూరితులై వున్నట్లు కనిపిస్తున్నది. నాకు దీనికిసరియైన కారణం చిక్కడంలేదు, కాని, యిందుకు తగిన కారణమేదో ఒకటి వుండివుండాలి అది యేమైయుంటుంది? కడపటికి ఈ కార్మికుల విషయంపట్టలేని సమస్యలాఏర్పడిపోయింది

## పాకీవాళ్ళయిబ్బంది తొలగింపు

నెల్లూరు పురపాలకసంఘ పాకీవాళ్ళు 1946 సం॥లో సమ్మె చేశారు. వారిలో 213 మందికి యిదివరలో రు. 3 అదనపుజీతం నెల ఒకటింటికి ఒక్క రూపాయ ప్రావిడెంటుఫండ్ 1-8-46 తేదినుండి ప్రభుత్వం యిచ్చింది. 30 మందికిమాత్రం అదనపువేతనాలు యివ్వకుండిరి ఈవిషయాన్ని ప్రభుత్వానికి నివేదించగా వారికిగూడ అదనపువేతనాలు 1-8-47 నుండి యిచ్చుటకు ప్రభుత్వం అంగీకరించింది. దాని సాధనకై సంసిద్ధంగావుండిన శ్రీ పొట్టిశ్రీరాములుగారు నిరసన వ్రతం చేయవలసిన అవసరం లేకపోయింది.

## కార్మికుల స్వాతంత్ర్య పర్వోత్సవం

చెన్నరాష్ట్ర మోటారు రవాణాసంఘానికి, సామాన్య కార్మికసమితికీ అధ్యక్షులైన శ్రీ యం. సీతారామయ్యగారు ఈలా వ్రాస్తున్నారు: రాష్ట్రములోని మోటార్ యూనియన్ల సంఘాలవారు, సామాన్య కార్మిక సమితివారూ కూడా ఆగస్టు 15 న ఆచరించవలసిన స్వాతంత్ర్యోత్సవ విధానాన్ని తెలియచెయ్యమని అడిగేరు. దేశభక్తుల సంపకాలూ, స్వాతంత్ర్యాన్ని మనకివ్వడమూ అన్నీ శాంతియుతంగాజరిగినందుకూ, స్వాతంత్ర్య పోరాటంలో కార్మికలోకం వహించిన ప్రధానపాత్రనుగూర్చి మనం గర్వపడుతున్నామని తెలియచెయ్యడానికి సంతోషిస్తున్నాము. కార్మికలోకమంతా ఆనాటికి తమతమ ప్రాంతాలలో స్వాతంత్ర్యపు పండుగను స్వతంత్రంగాజరిపి ఆనందించడమో, లేక కాంగ్రెస్‌సంఘాలచే జరుపబడు వుత్సవాలలో పాల్గొనడమో చేయవచ్చును. యీ తరుణంలోనే - ఇప్పుడు మనకువచ్చిన యీ స్వాతంత్ర్యం స్వార్థపరులకు కాదనీ, కార్మికలోకానికనీ బాగా నిరూపించాలి. విముక్తిసమయ సూచకంగా కార్మికులకు 2 మాసాల బోనసునైనా యిచ్చి సంతోషపెట్టమని కేంద్ర - రాష్ట్రప్రభుత్వాల్ని ప్రార్థిస్తున్నాను.

## గ్రామ ఆహార కమిటీల రద్దుచేయరాదు

నెల్లూరుజిల్లా కాంగ్రెసు తీర్మానాలు

నెల్లూరుజిల్లా కాంగ్రెసు కార్యవర్గ సమావేశం యీ నెల 6 తేది నెల్లూరులో జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ రావిపాటి మహానంద యిప్పటి వరకు జిల్లాలో సంపకం జరిగిన సభ్యత్వ పుస్తకాలు, తాలూకా సంఘాలకృషి, స్వాతంత్ర్య పండుగ ఆగస్టు 15 న ఏ విధంగా జరుపవలసినది వివరంగా నివేదించిన తర్వాత యీ తీర్మానాలు అంగీకరించబడినవి

అధ్యక్ష పదవికి రాజీనామాయిచ్చిన శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారిని ప్రస్తుతం జిల్లాలో ఆవరించియున్న హిందూ ముస్లిం వైషమ్యాలు, తిండికరువు పరిస్థితులదృష్ట్యా రాజీనామాను ఉపసంహరించుకోవాలనియూ, ఎలాగూ త్వరలో ఎన్నికలు జరుగును గనుక అప్పటి వరకు తన్నే అధ్యక్షులుగావుండాలనికోరుతూ తీర్మానించిరి.

గ్రామ ఆహార సంఘాల రద్దుచేయతలచినట్లువార్తలు వినుటకు యీ కమిటీవారు ఆందోళనపడుతూ, కొన్నిచోట్ల ఆహారకమిటీలు సక్రమంగా పనిచేయక పోయినంత మాత్రముచే సంఘాల రద్దుచేయకుండా క్రొత్తగా రాబోవు పంచాయతీ బిల్లు వచ్చి వాటికిపెత్తనం వచ్చు వరకైనా, అవసరమైన మార్పులు చేసి ఆహార సంఘాల నిలుపాలని ప్రభుత్వాన్ని కమిటీ వారు కోరుచున్నారు.

పెద్దధాన్యాదులకు కూడా బోనసు యివ్వాలనియూ యీ జిల్లాలో హెచ్చుభాగము జమీందార్ల పాలనలోవున్నది. జమీందారీ రద్దుచట్టము త్వరలో వస్తుందనే భయంతో వెంకటగిరి జమీందారు తన అనుయాయులద్వారా అప్పుడే గ్రామకంచలను యిజారాకు హెచ్చుమొత్తాలకు యిచ్చియూ వదుస్తున్నారు. కొన్నిచోట్ల తోపులు, సాముదాయక బంజర్ల తమ యిష్టులకు సక్రమింపజేసి డబ్బుసంపాదింప ప్రయత్నించుచున్నారు. గాన తక్షణం ఈ అన్యాయాన్ని అరికట్టుటకు యిటీవల ప్రకటించిన ఆర్డినెన్సును ఈ జమీందారీ కన్వయింప కోర్తాము.

జిల్లాలో ఎన్నో మార్గాలలో ప్రజావసరాలు తీర్చనన్ని బస్సులు లేనందున ప్రజలు యిబ్బంది పడుచున్నారు గాన అన్ని రూట్లలో అవసరమైనన్ని బస్సులు కొన్నను చేయాలని ప్రభుత్వాన్ని కమిటీ వారు కోరుచున్నారు

## భూమి విక్రయం

నెల్లూరుజిల్లా ఆత్మకూరుతాలూకా ఆత్మకూరు గ్రామంలో సర్వే నె 981-1,083 ల్లు మాగాణి ఎ 1-83 ట్లు విక్రయించబడును. కావలసినవారు దరఖాస్తులు పంపుకోవచ్చును. ఈ భూమి తాలూకా కచ్చేరి సమీపములో మంచి అనుకూలమయినచోట వున్నది. సులభముగా యిండ్లనివేశనముల క్రింద వుపయోగించుకోవచ్చును. 1947 ఆగస్టు తే 11 ది వరకు మాత్రం దరఖాస్తులు తీసుకోవడమవును.

సెక్రటరి:
పచ్చయప్పాస్ ట్రస్టుబోర్డు,
జి టి మద్రాసు.


DANCE

By

Travancore Sisters

★

భరతనాట్యం

(తిరువాన్‌కూర్ సోదరీమణులచే)

★

నెల్లూరులో

(బహుశా)

24-8-47

ఆదివారం

★

"సన్నపురెడ్డి పెండ్లిలో పసందుగ లాస్యమొనర్చి భావ సంపన్నములైన భంగిమల మంజురసామృతవృష్టిదేల్చి అభ్యున్నతిగూర్చి ప్రేక్షకుల ముగ్ధులజేసిన మోహదీప్తలౌ కన్నియ లీపురాన తిరుగా నటియింపగవత్రు చూడరే."

— శ్రీ కస్తూరీదేవి విద్యాలయ కమిటి.


Printer, Publisher & Managing Editor N. V. Rama Naidu, Zamin Ryot Power Press 176 Dandavari St. & 99 Thipparajuvari St., Nellore

